వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 260
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
జూలై 17, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## సబ్ స్టేషన్ ను సందర్శించిన సీఎండీ



8లో..



8లో..

## మహిళా సాధికారతే లక్ష్యం

- పలు వ్యాపారుల్లో వారి భాగస్వామ్యం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



8లో..

## సైలెన్సర్లతో టవర్

- ట్రాఫిక్ పోలీసుల వినూత్న ప్రదర్శన
- యువతకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఏర్పాటు



8లో..

## క్యూలైన్‌లో చెప్పులు, బుక్కులు

- యూరియా కోసం రైతుల పడిగాపులు
- మంత్రి ఇలాఖాలోనూ తప్పని తిప్పలు

వివరాలు 2లో..

# చాలెంజింగ్ ఆఫీసర్ చాహత్ బాజ్ పాయ్





**ఆకస్మిక తనిఖీలతో హల్ చల్**

**అక్రమార్కులపై ఉక్కు పాదం**

**గ్రేటర్ కమిషనర్ గా తనదైన ముద్ర**

**పాలనలో పట్టు బిగిస్తున్న ఐఏఎస్**

**మరో శాలినీమిశ్రా అంటూ కితాబు**

గ్రేటర్ వరంగల్ కు ఎంతో మంది కమిషనర్లు వస్తుంటారు.. పోతుంటారు. అందులో కొందరు మాత్రమే నగర ప్రజల గుండెల్లో కొలువై ఉంటారు. నగరాభివృద్ధిలో వారి మార్క్ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అలాంటి వారిలో ప్రముఖంగా చెప్పుకునే పేరు శాలినీ మిశ్రా అయితే అదే స్థాయిలో అధికారులను పరుగులు పెట్టిస్తూ పాలనను చక్కదిద్దే పనిలో పడ్డారు ప్రస్తుత కమిషనర్ చాహత్ బాజ్ పాయ్. 13 జూన్ 2025న విధుల్లో చేరిన కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ గ్రేటర్ పరిధిలోని అన్ని రంగాలపై పట్టు సాధిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తూ దూకుడు ప్రదర్శిస్తున్నారు. పడకేసిన స్మార్ట్ సిటీ, హృదయ్, అమృత్ పథకాలను గాడిలో పెట్టేందుకు చర్యలు చేపట్టారు. శానిటేషన్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారికి కావాల్సిన గ్లౌజ్ లు, రేయిన్ కోట్ లు ఇతర సదుపాయాలను కల్పించడంతోపాటు ప్రజల ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉందంటూ వారిని కార్యోన్ముఖులను చేశారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులు, ఉద్యోగులు, కార్మికులపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రజావసరాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. దీంతో నగరానికి మరో శాలినీమిశ్రా కమిషనర్ గా వచ్చిందంటూ స్థానికులు చాహత్ బాజ్ పాయ్ కి కితాబిస్తున్నారు.

–వరంగల్ వాయిస్ ప్రతినిధి

## మత్తెక్కిస్తున్న గంజాయి

- పోకిరీలుగా మారుతున్న యువత
- కాంగ్రెస్ నాయకులు దాసి రాందేవ్

8లో..

# చాలెంజింగ్ ఆఫీసర్..
# చాహత్ బాజ్ పాయ్








- ఆకస్మిక తనిఖీలతో హల్ చల్
- అక్రమార్కులపై ఉక్కుపాదం
- పాలనలో పట్టు బిగిస్తున్న ఐఏఎస్
- గ్రేటర్ కమిషనర్ గా తనదైన ముద్ర
- మరో శాలినీమిశ్రా అంటూ కితాబు



**`వరంగల్ వాయిస్ ప్రతినిధి :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ గా చాహత్ బాజ్ పాయ్ పాలనలో దూకుడు పెంచారు. నిత్యం క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తూ అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని పరుగులు పెట్టిస్తున్నారు. మొక్కవోని సంకల్పంతో ముందుకెళ్తున్నారు. 'సమస్యల వాణి.. మారాలి పరిష్కార బాణి' అంటూ ప్రతి సోమవారం గ్రీవెన్స్ కి వచ్చే దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపుతున్నారు. నగర ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. కరీంనగర్ కమిషనర్ గా పనిచేసిన అనుభవం చాహత్ బాజ్ పాయ్ కి కలిసొస్తుందనే చెప్పవచ్చు. సరిలేరు నీకెవ్వరూ అన్నట్లు పాలనపై పట్టు సాధిస్తున్నారు. దూకుడుగా వ్యవహరిస్తూ పెండింగ్ పనులను గాడిన పెడుతున్నారు. నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు.

### వృధాపై దృష్టి..

బల్దియా పరిధిలో వృధాపై కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. కార్పొరేషన్ ఆదాయానికి గండి కొట్టే ప్రతి దస్త్రాన్ని తిప్పి పంపుతున్నారు. చెత్త తరలింపు వాహనాలపై నిఘా పెంచారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ పకడ్బంధీగా జరిగేలా చర్యలు చేపట్టారు. బల్దియాకు చెందిన అన్ని వాహనాలకు 'జీపీఎస్' సిస్టమ్ ఏర్పాటు చేయాలంటూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. బల్దియా ఖజానాకు నష్టం తెస్తున్న కోడి వ్యర్థాల సేకరణ కాంట్రాక్టును బహిరంగ వేలం ద్వారా ఖరారు చేసేందుకు నిర్ణయించారు. పిల్లల పార్క్, పబ్లిక్ గార్డెన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్లు, డ్రైనేజీలతోపాటు అసంపూర్తి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

### ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి..

ప్రజారోగ్యం, పారిశుధ్యంపై కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు. అమ్మవారిపేటలో నగర వాసుల అవసరాలకు అనుగుణంగా 150 కేఎల్ డీ సామర్థ్యంతో నిర్మిస్తున్న మానవ వ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని సిద్ధం చేశారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు.

### ప్లాస్టిక్ పై సమరం..

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ సీరియస్ గా ఉన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించే దుకాణదారులకు రూ. లక్ష వరకు జరిమానా విధించడంతోపాటు రవాణా చేసేందుకు ఉపయోగించే వాహనాలను, షాపును సీజ్ చేస్తున్నారు. ప్లాస్టిక్ ను ప్రోత్సహించే వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. నగరంలో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పలు కాలనీలో నూతనంగా మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మిస్తూ ప్రజలకు మెరుగైన సదుపాయాలను అందిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచేలా సిబ్బంది తగు సూచనలు చేశారు. గ్రేటర్ లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు, కార్మికులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదంటూ హెచ్చరికలు జారీ చేశారు. సమయపాలన పాటించని వారిపై వేటు వేస్తున్నారు.

### ప్రజావసరాలే లక్ష్యంగా..

నగరంలో పెండింగ్ లో ఉన్న స్మార్ట్ సిటీ, హృదయ్, అమృత్ తో పాటు ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ దృష్టి సారించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రజావసరాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. దీంతో కమిషనర్ కు ఏదైనా పని చెప్పాలంటేనే ప్రజాప్రతినిధులు జంకుతున్నారు.
















### పరుగులు పెట్టిస్తున్నారు..

వరంగల్ మహా నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ నిత్యం క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేస్తూ అధికారులను పనుగులు పెట్టిస్తున్నారు. నగరంలో చేపడుతన్న పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలంటూ ఆదేశిస్తున్నారు. అలా అన్ని సక్రమంగా ఉంటేనే బిల్లులు చెల్లిస్తున్నారు. ఉద్యోగులు, జవాన్లు, ఇతర సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. పాలనలో దూకుడు పెంచి ప్రజలకు చేరువవుతున్నారు. బల్దియా పరిధిలోని అన్ని విభాగాల్లో పట్టు సాధిస్తున్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, జూలై 17, 2025

# కాంగ్రెస్ మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం

◆ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు
◆ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి పనులలో భాగంగా, నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్‌లోని గుండ్ల సింగారం, బంజారా కాలనీ, పోలీస్ కాలనీలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 40 లక్షల సాధారణ నిధులతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణ పనులకు ఆయన కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు స్థానిక కాలనీ వాసులతో కలిసి కలియ తిరుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన పలు గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా దశల వారీగా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను చేపడుతున్నామని తెలిపారు. కొబ్బరికాయ కొట్టిన ప్రతి అభివృద్ధి కార్యక్రమం నిర్ణీత సమయంలోనే పూర్తి చేస్తామని, ప్రజలకు ప్రజా ప్రభుత్వం నిజమైన భరోసా ఇస్తుందని అన్నారు. నిత్యం వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం, నూతన ఆవిష్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తూ ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తామని, అర్హులైన పేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశల వారీగా అమలు చేస్తోందని, పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర సర్కార్ పని చేస్తోందని, ఇది పేదల ప్రభుత్వమని ఆయన అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని సుదూర ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు, ఎలాంటి డబ్బులు ఖర్చు చేయకుండా 8096107107 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చని ఎమ్మెల్యే నాగరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లావుద్య రవి నాయక్, డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, పాక్స్ చైర్మన్ మెరుగు రాజేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన – సింగిల్ లాల్, మాజీ ఎంపీపీ అనిల్ రెడ్డి, మండల అధ్యక్షుడు మదాసి అజయ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ పుట్ట తిరుపతి, డివిజన్, గ్రామ స్థాయి నాయకులు, మహిళలు, యువత నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సై మధుకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** కమలాపూర్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతగి మధుకు మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి ప్రజాపతులు ఘన సన్మానం చేశారు. మర్యాదపూర్వకంగా ఎస్సై మధును కలిసిన కుమ్మరి ప్రజాపతులు శాలువాతో సత్కరించి, బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి ప్రజాప్రతుల్లో పెద్దమనిషి సముద్రాల ఇస్తారి, కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సముద్రాల కృష్ణ, క్యాషియర్ సముద్రాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇజ్జిగిరి దేవేందర్, సముద్రాల రమేష్ బాబు, సముద్రాల రంజిత్, తదితరులు పాల్గొన్నారు. వీరంతా ఎస్సై మధును కలిసి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# జనగామ రైల్వే స్టేషన్‌లో ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆపాలని బీజేపీ వినతి



**వరంగల్ వాయిస్, జనగామ:** జనగామ రైల్వే స్టేషన్‌ను గురువారం సందర్శించిన సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ (జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాత్సవను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ నేతృత్వంలోని బృందం కలిసింది. ఈ సందర్భంగా వారు రైల్వే స్టేషన్‌కు సంబంధించిన వివిధ సమస్యలపై జీఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ మాట్లాడుతూ జనగామ జిల్లా కేంద్రం నుండి చుట్టుపక్కల వందలాది గ్రామాల ప్రజలు నిత్యం రైలు ప్రయాణం చేస్తుంటారని తెలిపారు. సరైన సమయంలో రైళ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. శాతవాహన, చార్మినార్, షిర్డీ, కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జనగామలో హాల్టింగ్ (ఆగే విధంగా) కల్పిస్తే ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. గతంలో చాలా సందర్భాల్లో అధికారులకు ఈ విషయాన్ని విన్నవించినా ఫలితం లేదని, ఇప్పుడు జీఎం వెంటనే స్పందించి రైళ్లు ఆగే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అదేవిధంగా, కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన రైల్వే స్టేషన్ సుందరీకరణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని కూడా జీఎంను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మకంటి అనిల్, ప్రధాన కార్యదర్శులు పెద్దోజు జగదీష్, తోకల హరీష్, రవి, రాజా, ఓబీసీ మోర్చా నాయకులు చంద్రం, సీనియర్ నాయకులు లభిశెట్టి వీరలింగం, శివకృష్ణ, కాసుల శ్రీనివాస్, పానుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

డీపీఓ లక్ష్మీ రమాకాంత్



**వరంగల్ వాయిస్, నడికూడ:** పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని హనుమకొండ జిల్లా పంచాయతీ అధికారి ఎల్. లక్ష్మీ రమాకాంత్ అన్నారు. గురువారం మండలంలోని కంటాత్మకూర్ గ్రామంలో నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఆయన వీధుల్లోని పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ డబ్బాలు, కొబ్బరి బోండాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ఇంటి పరిసరాలలో పిచ్చి మొక్కలు పెరిగి, నీరు నిల్వ ఉన్నట్లయితే దోమల వ్యాప్తి పెరిగి, ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ డ్రై డేను విధిగా పాటించి, వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్. రవి, పంచాయతీ కార్యదర్శి బి.భార్గవి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# రాష్ట్ర క్రీడా పాఠశాలకు కాళేశ్వరం విద్యార్థుల ఎంపిక




**వరంగల్ వాయిస్, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర క్రీడా పాఠశాలకు ఎంపికయ్యారు. ఈ నెల 1 నుంచి 8 వరకు హైదరాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠశాల ఆవరణలో జరిగిన ఎంపిక పోటీలలో, జిల్లా నుంచి పాల్గొన్న ఈ ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి నాలుగో తరగతిలో తమ స్థానాలను సుస్థిరం చేసుకున్నారు. ఎంపికైన వారిలో కోల శాన్వి, గంట హరిచందన, నాగుల తులసి ఉన్నారు. ఈ ముగ్గురు చిన్నారులు కాళేశ్వరం గ్రామానికి చెందినవారే కాగా, వారిలో ఇద్దరు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ చిన్నారులకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతమైన కాళేశ్వరం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికవడం పట్ల మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. దీనితో పాటు స్థానికంగా కూడా గ్రామస్తుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.

# అక్రమ అరెస్టుపై ఏఐఎఫ్‌డీఎస్ ఆగ్రహం



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** కాకతీయ యూనివర్సిటీకి గవర్నర్ వస్తున్న సందర్భంగా ఆయనను కలిసేందుకు వెళ్లిన అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గడ్డం నాగార్జునతో పాటు ఇతర విద్యార్థి నాయకులను ఈ నెల 7న పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో బంధించడంపై ఏఐఎఫ్‌డీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జూలై 7న విద్యార్థి సంఘాల రాష్ట్ర నాయకులు ఎలాంటి ప్రజా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వలేదని, కేవలం గవర్నర్ కేయూకి వస్తున్న సమయంలో ఆయనను కలిసి, సమస్యలను వివరించి తక్షణమే పరిష్కరించాలని అర్జీ పెట్టుకునేందుకే కలిసేందుకు వెళ్లారని పల్లె మురళి స్పష్టం చేశారు. అలాంటి వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి నేరస్తుల వలె నిర్బంధించడం ఏ ప్రజాస్వామ్య విధానమని కాంగ్రెస్ పాలకులు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు ఏఐఎఫ్‌డీఎస్‌తో పాటు ఏ విద్యార్థి సంఘమూ వ్యతిరేకం కాదని, అయితే అది కేయూ స్థలాలలో నిర్మించడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నారని పల్లె మురళి పేర్కొన్నారు. మాటిమాటికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల కనీస ప్రాథమిక హక్కులను అణచివేతకు పాల్పడితే అవకాశం కోసం కాచుకుని ఉన్న మనువాద కార్పొరేట్, ప్రజా వ్యతిరేక శక్తులు గద్దె ఎక్కుతాయనే వాస్తవాన్ని కాంగ్రెస్ పాలకులు గుర్తించి మసలుకోవాలని ఆయన సూచించారు. అక్రమ అరెస్టులు, కేసులు, నిర్బంధాలను విరమించుకోవాలని, తక్షణమే ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జునతో పాటు ఇతర విద్యార్థి సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులను విడుదల చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# విశిష్ట అవార్డు గ్రహీత సీఐ షకూర్ కు ఘన సన్మానం




**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ రామన్నపేటలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చాటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి విశిష్ట అవార్డు పొందిన ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ షకూర్ ను ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ.ః రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చే అత్యుత్తమ అవార్డు పొందడం పోలీస్ శాఖకే కాకుండా ఓరుగల్లుకు కూడా కీర్తి ప్రతిష్ఠలు తేవడం చాలా సంతోషకర విషయమని అన్నారు. పోలీసులు దీన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇలాగే అందరూ తమ వృత్తికి సరైన న్యాయం చేయాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ శ్రవణ్, కోఆర్డినేటర్ మోహన్ వారణాసి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభంజన్ యాదవ్ మృతి బీసీ ఉద్యమానికి తీరని లోటు

**తాటిపాముల వెంకట్రాములు**



**వరంగల్ వాయిస్, వరంగల్:** అలుపెరుగని పోరాట యోధుడు, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ బుధవారం హైదరాబాద్‌లో అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక సంతాప ప్రకటనలో తెలిపారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ఉద్యోగానికి రాజీనామా చేసి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. రాష్ట్ర అవతరణ తర్వాత సామాజిక తెలంగాణ కోసం బీసీలలో రాజకీయ చైతన్యాన్ని రగిలించి, బహుజన రాజ్యాధికారం కోసం పోరాడేందుకు వారిని కార్యోన్ముఖులను చేయడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిది అని వెంకట్రాములు కొనియాడారు. బీసీ ఉద్యమాలు ఉధృతమవుతున్న సమయంలో ప్రభంజన్ యాదవ్ మరణించడం బీసీ ఉద్యమాలకు తీరని లోటని వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలను సాధించేందుకు బహుజన రాజ్యాధికారం కోసం పోరాడటమే ఆయనకు నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందని వెంకట్రాములు అన్నారు.

# పీహెచ్‌సీని సందర్శించిన ఎంపీడీవో భాస్కర్



**వరంగల్ వాయిస్, గణపురం:** మండలంలో సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు తాను గణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) గురువారం సందర్శించినట్లు ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. వ్యాధుల నివారణకు పీహెచ్‌సీలో తగిన మందులు అందుబాటులో ఉన్నాయని, సిబ్బంది చిత్తశుద్ధితో వైద్య సేవలు అందిస్తున్నారని తన సందర్శనలో తేలిందని ఆయన అన్నారు. కాగా, పీహెచ్‌సీలో లక్ష్యం మేరకు బెడ్లు ఉన్నాయని, సిబ్బంది కూడా సరిపడా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనూష, పంచాయతీ కార్యదర్శి విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# శానిటేషన్ పనులు పర్యవేక్షించిన మాజీ కౌన్సిలర్ సంపత్



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలోని ఒకటో వార్డులో శానిటేషన్ పనులు సక్రమంగా జరగడం లేదని స్థానికులు మాజీ కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్ దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. మున్సిపల్ సిబ్బందిని పిలిపించి డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సంపత్ కుమార్ మాట్లాడుతూ, వార్డు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయడమే తన ధ్యేయమని, వార్డును పరిశుభ్రంగా ఉంచడమే తన లక్ష్యమని తెలిపారు. తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని మడికొండ సంపత్ కుమార్ హామీ ఇచ్చారు.

# యువతలో దైవభక్తితో పాటు దేశభక్తి అవసరం

**◆ కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, బాలసముద్రం:** యువతలో దైవభక్తితో పాటు దేశభక్తి కూడా ఉండాలని కాజీపేట అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) పింగిలి ప్రశాంత్ రెడ్డి అన్నారు. గురువారం బాలసముద్రంలోని సాయినాథుని మందిరాన్ని సందర్శించిన ఆయనకు మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, వాయిగండ్ల రమేష్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మందిర పూజారులు మణిశర్మ, చందు బాబా శేష వస్త్రాలను సమర్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్ మందిరంలో నిర్వహిస్తున్న పూజ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు, ఇతర విశేషాలను ప్రశాంత్ రెడ్డికి వివరించారు. ప్రశాంత్ రెడ్డి జమ్మికుంటలో విధులు నిర్వహిస్తున్న సమయంలో, అక్కడ ప్రతి నిత్యం ఉదయం 8 గంటలకు జాతీయ గీతమైన 'జనగణమన'ను ప్రతి ఒక్కరూ ఎక్కడి వారక్కడ ఆగి విధిగా ఆలపించేలా ప్రేరేపించారని, ఇప్పటికీ ఆ కార్యక్రమం అమలవుతున్న తీరు అభినందనీయమని ధర్మకర్తలు ఏసీపీ ప్రశాంత్ రెడ్డిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

**◆ భూపాలపల్లి నియోజకవర్గంలో ఆలయాలకు రూ. 3.22 కోట్లు**

**◆ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



**వరంగల్ వాయిస్, రేగొండ:** రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, వివిధ వర్గాల ప్రజలు ఆరాధించే ఇష్ట దేవతల ఆలయాలకు తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. గురువారం నియోజకవర్గంలోని పలు మండలాలతో పాటు ఉమ్మడి రేగొండ, గోరికొత్తపల్లి కేంద్రాలలో బీరన్న గుడి నిర్మాణానికి, రేగొండ మండల కేంద్రంలో రావులపల్లె పోచమ్మ గుడికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, లక్ష్మి రాజయ్య, ఎంపీడీవో ఎం.వెంకటేశ్వర్ రావు, గడ్డం రాంప్రసాద్ రావు, ఈఈ, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్ఆర్ మాట్లాడుతూ, భూపాలపల్లి నియోజకవర్గంలో సీజీఎఫ్ (కాంగ్రెస్ జనరల్ ఫండ్) నుంచి రూ. 3 కోట్ల 22 లక్షల రూపాయలను దేవస్థానాలకు కేటాయించి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ముందుగా ఉమ్మడి రేగొండ, గోరి కొత్తపల్లి మండలం తో పాటు ఆజంనగర్, గొల్ల బుద్దారంలలోని రామాలయాలు, పోచమ్మ దేవాలయాలు, పెద్దమ్మ దేవాలయాలకు ప్రజలు కోరిన వెంటనే మంజూరు తీసుకొచ్చి శంకుస్థాపనలు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం ప్రజల సాంప్రదాయ పద్ధతిలో పోచమ్మ తల్లి బోనాలు, పెద్దమ్మతల్లి బోనాలు, రేణుక ఎల్లమ్మ తల్లి బోనాలు, అదేవిధంగా అంజన్న స్వామి, రామాలయాల కోసం ప్రజల కోరిక మేరకు నిధులను తీసుకురావడం జరిగిందన్నారు. శంకుస్థాపనలు అయిన పనులను అధికారులు సకాలంలో పూర్తి చేసి, ప్రజల కోరిక మేరకు వెంటనే ప్రతిష్ఠ చేసుకునేలా గ్రామాలలోని ఆలయ నిర్వాహక కమిటీలు, గ్రామస్తులు అందరూ సహకరించి త్వరగా పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ రజాక్, స్థానిక కార్యదర్శులు బాలవేణి రాంబాబు, తుల్జారాణి, కార్డ్‌వార్లు ముష్క రమేష్, కట్ల నాగరాజు, రెండు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య, నూదనబోయిన ఓం ప్రకాష్, తోకల సురేందర్ రెడ్డి, మేకల భిక్షపతి, భూపాలపల్లి జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గుటోజు కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పత్తి ప్రభాకర్, మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మీ రవి, మోడెం ఉమేష్ గౌడ్, మటిక సంతోష్, మైన భిక్షపతి, కేశిరెడ్డి ప్రతాప్ రెడ్డి, పట్టెమ్ శంకర్, బందారి దేవేందర్, ముదతనపల్లి శంకరయ్య, జంగిటి సుధాకర్, క్యాసెట్టి రాజయ్య, నడిపెల్లి వెంకట్రావు, దుగ్యాల రాజేశ్వరరావు, పాతపెల్లి సంతోష్, అమ్ముల రాజయ్య, పంగ ఐలయ్య, పొనుగోటి వీరబ్రహ్మం, కోలపాక సాంబయ్య, సామల సురేందర్, మార్కెట్ డైరెక్టర్ బొమ్మకంటి రవి, బీరన్న గుడి అధ్యక్షుడు నూదనబోయిన కృష్ణమూర్తి యాదవ్, ఉపాధ్యక్షులు ఉడత రమేష్ యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పుట్ట రవి బాలయ్య, పల్లె గ్రామ కమిటీ అధ్యక్షుడు తొట్ల కుమారస్వామి, గోరి కొత్తపల్లి మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వైనాల ప్రభాకర్, మండల నాయకులు సాదు బిక్షపతి, జూపాక మొగిలి, సూదేన బోయిన రాజయ్య, సందెల మధుకర్, ఉమ్మడి మండల బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జోరు సుదర్శన్, యూత్ నాయకులు అచ్చ దేవేందర్, జూపాక అశోక్, గూడ నరేష్ వర్మ, పల్లెవెన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే జీఎంను కలిసిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, కాజీపేట:** సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌గా నూతనంగా నియమితులైన నేడు కాజీపేటకు విచ్చేసిన సంజయ్ కుమార్ శ్రీవాత్సవ్‌ను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కాజీపేట రైల్వే స్టేషన్‌లో జరిగిన ఈ భేటీలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణు వర్ధన్ కూడా పాల్గొన్నారు. నూతన జీఎంకు ఎమ్మెల్యే నాయిని శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే జీఎంకు పలు విజ్ఞప్తులు చేశారు. హనుమకొండ నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రోడ్డు మార్గం కాజీపేట మీదుగా ఉన్నప్పటికీ, కాజీపేటలో బస్ స్టాండ్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలోనే రైల్వే శాఖకు కాజీపేట రైల్వే స్టేడియంలో ఉన్న స్థలాన్ని బస్ స్టాండ్ నిర్మాణం కోసం మంజూరు చేయాలని కోరామని, ఈ స్థల కేటాయింపు ప్రక్రియను సానుకూల దృక్పథంతో వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కోచ్ ఫ్యాక్టరీలో ఉద్యోగ, ఉపాధి రంగాల్లో స్థానికులకు 50శాతం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గతంలో నిలిచిపోయిన రైళ్లను పునఃప్రారంభించి కాజీపేటలో హాల్టింగ్ (ఆగే విధంగా) కల్పించాలని కోరారు. జంట నగరాలుగా ఉన్న ఈ ప్రాంతంలో రైల్వే డివిజన్ ఏర్పాటు ఆవశ్యకత ఉందని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే నాయిని కోరిన అంశాలపై జీఎం సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అంకుస్, నాయకులు మనోహర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే నిజమైన ఇందిరమ్మ రాజ్యం

◆ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
◆ ఒకే రోజు రెండు కోట్ల చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం నాడు అంబేద్కర్ భవన్‌లో జరిగిన ప్రత్యేక చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 52 మంది లబ్ధిదారులకు రూ. 19,79,000/- విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను, హనుమకొండ మండలానికి చెందిన 202 మంది లబ్ధిదారులకు రూ. 2,22,02,432/- విలువైన కల్యాణలక్ష్మి / షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే నిజమైన ఇందిరమ్మ రాజ్యం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. పేద కుటుంబాల్లో కూతుళ్ల పెళ్లిళ్లు ఆర్థిక భారం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా గౌరవాన్ని కల్పిస్తోందని తెలిపారు. ఆపదలో ఉన్న వారికి వైద్య ఖర్చుల భారం తట్టుకునేందుకు సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతోందని, ఇది ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. "ఇది పార్టీ పాలన కాదు – ప్రజా పాలన. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ మద్దతుగా నిలవడమే మా కర్తవ్యం" అని ఆయన స్పష్టం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే సదుద్దేశంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యస్థాపనలో భాగంగా సంక్షేమ పథకాలకు మహిళలకే పెద్ద పీట వేసేలా చూస్తోందని అన్నారు. ఇప్పటికే ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాల ద్వారా సాధికారత కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని నాయిని రాజేందర్ రెడ్డి వివరించారు. పనిచేసే వారిని గుర్తించి ప్రజలు పట్టం కట్టాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

◆ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మకూరు, దామెర మండలాల నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు రేషన్ డీలర్లు ఎమ్మెల్యేను శాలువా, పూల బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మకూరు మండలానికి చెందిన 428 మంది లబ్ధిదారులకు, అలాగే దామెర మండలానికి చెందిన 518 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. గత 18 నెలలుగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తుందని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. ప్రజల సంక్షేమానికి తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పుల కోసం పదేళ్లపాటు నిరీక్షణ చేసి ప్రజలు వేసారిపోయారని, రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు దూరమయ్యాయని రేవూరి ప్రకాష్ రెడ్డి విమర్శించారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి పథకాలను మంజూరు చేస్తున్నామని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కమలాపురం రమేష్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సునంద సుధాకర్ రెడ్డి, ఆత్మకూర్ మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, నాయకులు కక్కర్ల రాజు, మార్క్ రజనీకాంత్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికెల వాసు, బరుపట్ల కిరీటి, రేవూరి జయపాల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు సందీప్ బొరుపట్ల అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

# 23న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

◆ వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఈ నెల 23న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బాలసముద్రంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐడీఎస్‌వో, ఏఐపీఎస్‌యూ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కన్వీనర్ మాస్ సావిత్రి, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష, ఏఐఎస్‌బీ హనుమకొండ జిల్లా కన్వీనర్ రోహిత్ లు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి. విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలి. ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈవో, డీఈవో పోస్టులను భర్తీ చేయాలి. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పించి, నిధులు కేటాయించాలి. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చేయాలి. విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత బస్ పాస్‌లు ఇవ్వాలి. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020ని తెలంగాణలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. జూలై 23న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు, మేధావులు, కవులు, కళాకారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 18న అంబేద్కర్ జంక్షన్‌లో ఉదయం 11 గంటలకు పోస్టర్ ఆవిష్కరణ. 19న కాళోజీ జంక్షన్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం. 21న జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలకు విద్యార్థి సంఘాల వినతిపత్రాల సమర్పణ. 23న విద్యాసంస్థల బంద్ నిర్వహణతో పాటు భారీ బైక్ ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జక్కుల భానుప్రసాద్, వేల్పుల చరణ్, బొజ్జ జ్యోతి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, చెన్నూరి సాయి కుమార్, మల్లేష్, బైరెడ్డి జశ్వంత్, రాహుల్ గణేష్, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా నాయకులు పూల బోయిన రాజు, పీడీఎస్‌యూ నాయకులు బాలకృష్ణ, వంశీ పాల్గొన్నారు.

# 18న బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

ముఖ్య అతిథిగా హాజరు కానున్న చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల:** శుక్రవారం పరకాలలో బీఆర్ఎస్ మండల, గ్రామ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశం పరకాలలోని పద్మశాలి భవనంలో జరుగుతుంది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరుకానున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి తెలిపారు. కాబట్టి, పరకాల బీఆర్ఎస్ పార్టీ మండల, గ్రామ పార్టీ, అనుబంధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కో–ఆప్షన్ సభ్యులు, సొసైటీ చైర్మన్లు, కమిటీ సభ్యులు, యూత్ విభాగం, పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# ఆర్ట్స్ కళాశాలలో ముగిసిన వర్క్ షాప్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఎల్ఈడీ బల్బులు తయారు చేసే విధానంపై నైపుణ్య శిక్షణ గురువారం ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతితో పాటు కళాశాల అధ్యాపకులు కూడా పాల్గొని ఎల్ఈడీ బల్బుల తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగిన ఈ నైపుణ్య శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని, స్వయంగా ఎల్ఈడీ బల్బులు తయారు చేసే పరిజ్ఞానాన్ని వారు నేర్చుకున్నారని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సాంకేతిక నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహ్మాన్, భౌతిక శాస్త్ర విభాగం అధ్యాపకులు, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ జితేందర్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ఏ సరిత, డాక్టర్ బి సరిత, డాక్టర్ ప్రశాంత్, ఎల్ఈడీ బల్బ తయారీ విధానాన్ని నేర్పిన మల్లేశం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ట్స్ కాలేజీలో బీఏ ఆనర్స్ సోషియాలజీ కోర్సులో సీట్లు

## దోస్త్ 2025లో దరఖాస్తు చేసుకోండి

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండలోని సుబేదారిలో ఉన్న యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మూడేళ్ల బీఏ ఆనర్స్ సోషియాలజీ కోర్సు అందుబాటులో ఉందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి, సోషియాలజీ ఇంచార్జి డాక్టర్ పుల్లా రమేష్ సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్స్, సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి, అలాగే మహిళలకు ప్రత్యేకంగా సీడీపీఓ (చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్), ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, సోషల్ వర్కర్, కౌన్సిలర్ వంటి ఉద్యోగాల కోసం ఈ ఆనర్స్ సోషియాలజీ కోర్సు ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆనర్స్ సోషియాలజీ కోర్సు కేవలం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. దోస్త్ 2025 చివరి ఫేజ్‌లో ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకొని కళాశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94906 64966 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

# డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ:** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 22 మంది వ్యక్తులను మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశం ఎదుట హాజరుపరచగా, వారిలో ముగ్గురికి జైలు శిక్ష, మిగిలిన వారికి జరిమానాలు విధించారు. పఠాన్ హుస్సేన్, వదనల శ్రీనివాసరావు, బానోత్ దేవేందర్లకు రెండు రోజుల జైలు శిక్ష పడగా, వారిని హుజూరాబాద్ సబ్ జైలుకు తరలించారు. మిగిలిన 19 మంది వ్యక్తులకు రూ. 20,600 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు.

# గ్రామాల అభివృద్ధి బాధ్యత నాదే

◆ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
◆ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** మండలంలోని ఫతేషాపూర్ గ్రామం వద్ద, నీడిగొండ నుంచి ఖిలాషాపూర్ వరకు రూ. 6 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆవిష్కరించారు. ఈ రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చి 16న శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి రూ. 20 లక్షలతో నిర్మించనున్న ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా మంజూరైన బ్యాంక్ లింకేజ్ రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్ జంట గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఇబ్రహీంపూర్‌లో మహిళా భవనానికి రూ. 5 లక్షలు, ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్ గ్రామాలలో ఎస్సీ కమ్యూనిటీ హాళ్లకు రూ. 10 లక్షల చొప్పున మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఫతేషాపూర్‌లో కూడా త్వరలోనే ఎంపీ నిధుల నుంచి మహిళా భవనం మంజూరు చేస్తానని తెలిపారు. ఇప్పటికే ఈ రెండు గ్రామాలకు కలిపి 38 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, రెండవ విడతలో రెండు గ్రామాలకు మరో 20 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తానని ఆయన తెలిపారు. అశ్వరావపల్లి కుడి కాలువ ద్వారా వారం రోజులలో నీటి విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, డీఎంహెచ్ఓ, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు, గ్రామస్తులు, మాజీ జడ్పీటీసీలు లింగాల జగదీష్ చంద్ర రెడ్డి, బొల్లం అజయ్ మణికంఠ, బాష్మియా, సింగిల్ విండో చైర్మన్ గంగిడి నరసింహారెడ్డి, గుట్టం భాస్కర్ రెడ్డి, గాదె మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోళ్ల రవి గౌడ్, జిల్లా అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్ట్రిచ్ పక్షిని దత్తత తీసుకున్న కుడా చైర్మన్ ఇనగాల



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్‌లోని కాకతీయ జూలాజికల్ పార్కులో జంతువుల దత్తత పథకంలో భాగంగా వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఒక ఆస్ట్రిచ్ పక్షిని ఆరు నెలల పాటు దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం జూ పార్కును సందర్శించారు. ఆస్ట్రిచ్ పక్షి సంరక్షణ, పోషణ నిమిత్తం రూ. 60,000 విలువైన చెక్కును జూ ఫారెస్ట్ రేంజ్ అధికారిణి మయూరి రెడ్డికి అందజేశారు.

## కొండేటి శ్రీధర్‌కు పరామర్శ



**వరంగల్ వాయిస్, వరంగల్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్ర రావుపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కచేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఖమ్మం జిల్లాలో నిర్వహించిన భట్టి విక్రమార్క దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో బీజేపీ శ్రేణులకు, పోలీసులకు మధ్య జరిగిన తోపులాటలో స్వల్ప గాయాలపాలై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్ ను హనుమకొండ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంద్ర మధు, వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పోలేపక మార్టిన్ లూథర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసురాజు పరామర్శించారు. వారు కొండేటి శ్రీధర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## కోటగుళ్లలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ దంపతుల ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం:** కాకతీయుల కళాక్షేత్రమైన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్ల)లో గురువారం భూపాలపల్లి, ములుగు జిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ వేముల శ్రీనివాస్ ఆయన సతీమణి రజినితో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు నాగరాజు దంపతులను శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## పత్తిలో "కాండానికి బొట్టు పెట్టే" పద్ధతిపై రైతులకు అవగాహన



**వరంగల్ వాయిస్, దామెర:** పత్తి పంటలో కాండానికి బొట్టు పెట్టే పద్ధతిపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రామకృష్ణ గురువారం నిర్వహించారు. దామెర మండలంలోని పులుకుర్తి గ్రామంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ పద్ధతిలో ఒక వంతు మోనోక్రోటోపాస్ 36% మందును 1:4 నిష్పత్తిలో ఒక లీటరు నీటిలో కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని బ్రష్ సహాయంతో పత్తి మొక్క కాండంపై, ఎరుపు రంగు ఆకుపచ్చగా ఉన్న చోట అంటించాలి. ఇలా 20, 40, 60 రోజులకు పంటపై అంటించినట్లయితే రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా అరికట్టవచ్చని, రైతులందరూ ఈ పద్ధతిని పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బొల్లం వేణుగోపాల్, గోపు సతీష్, తోటకూర కిషన్, అంకేశ్వరపు రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

## డాక్టర్ మార్త భాస్కర్ రావుకు 'బెస్ట్ టీచర్' అవార్డు



**వరంగల్ వాయిస్, వరంగల్:** శల్య తంత్రం (శస్త్రచికిత్స), పరిశోధన, ఆరోగ్య సంరక్షణ, ప్రజాసేవ రంగాలలో డాక్టర్ ప్రొఫెసర్ మార్త భాస్కర్ రావు చేసిన విశేష కృషికి గాను నేషనల్ సుశ్రుత అసోసియేషన్ ఇండియా ఆయనను బెస్ట్ టీచర్ (సీనియర్ గ్రూప్)–2024 అవార్డుతో సత్కరించింది. నేషనల్ సుశ్రుత అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఢిల్లీలో జరిగిన శల్యకాన్ – 2025 జాతీయ సమావేశాలలో, జూలై 14న కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ చేతుల మీదుగా భాస్కర్ రావు ఈ అవార్డును అందుకున్నారు. వరంగల్‌కు చెందిన డాక్టర్ ప్రొఫెసర్ మార్త భాస్కర్ రావుకు 35 సంవత్సరాలకు పైగా వైద్య సేవలు అందించడంతో పాటు బోధన, పరిశోధనలో విస్తృత అనుభవం ఉంది. ఆయన 12 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్‌లకు పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో 8 పుస్తకాలు, 40 కి పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించారు. ఆయన నేషనల్ సుశ్రుత అసోసియేషన్, భారతదేశంలో జీవితకాల సభ్యుడు. ఆయన ఆంగ్లంలో రాసిన 5 ఆయుర్వేద పుస్తకాలు ప్రచురితం అయ్యాయి. అంతేకాకుండా, ఆయన వెయ్యికి పైగా జాతీయ, అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొని, 30కి పైగా అంతర్జాతీయ పరిశోధనా పత్రాలను సమర్పించారు. డాక్టర్ భాస్కర్ రావు జపాన్, ఆస్ట్రేలియా, లండన్, అమెరికా వంటి దేశాల్లో వివిధ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ కృషికి గాను ఆయనకు జపాన్‌లో యంగ్ సైంటిస్ట్ అవార్డు, లండన్‌లో శుశ్రుత అవార్డు లభించాయి. ప్రస్తుతం వరంగల్‌లో పనిచేస్తూనే, భారత ప్రభుత్వం ఆయుష్ మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠం, న్యూ ఢిల్లీ –గురుగ్రామ్ కేంద్రంగా పనిచేస్తున్నారు. సర్జన్‌గా, ఆయన వివిధ సంక్లిష్టమైన, ఇతర పునరావృత అనోరెక్టల్ రుగ్మతల 15,000 కి పైగా కేసులను విజయవంతంగా నిర్వహించారు. ఇటీవల లేజర్ పైల్స్ పద్ధతిలో శిక్షణ పొందిన డాక్టర్ భాస్కర్ రావు 2020 నుంచి 300కి పైగా కేసులను విజయవంతంగా నిర్వహించారు. డాక్టర్ భాస్కర్ రావు అద్భుతమైన కృషిని గుర్తించి నేషనల్ సుశ్రుత అసోసియేషన్ ఇండియా ఆయనను బెస్ట్ టీచర్ అవార్డు (సీనియర్ గ్రూప్)–2024తో సత్కరించింది. ఈ సందర్భంగా భాస్కర్ రావును పలువురు అభినందించారు.


## గోదావరి జలాలతో జనగామ చెరువులు, కుంటలు నింపాలి


◆ సీపీఎం నాయకుల డిమాండ్



**వరంగల్ వాయిస్, జనగామ:** గోదావరి జలాలను లిఫ్టింగ్ చేసి దేవాదుల ప్రాజెక్టు ద్వారా జనగామ ప్రాంతంలోని చెరువులు, కుంటలు నింపి రైతులకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, మండల కార్యదర్శి బోడ నరేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం జనగామ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం జనగామ తాసిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగామ ప్రాంతం భారతదేశంలో అతి ఎత్తైన ప్రాంతంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం గోదావరి జలాలను సముద్రంలోకి వృథాగా విడుదల చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నీటిని దేవాదుల ప్రాజెక్టు ద్వారా లిఫ్టింగ్ చేసి జనగామ ప్రాంతానికి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. వాతావరణ శాఖ రాష్ట్రంలో అధిక వర్షపాతం నమోదు అవుతుందని సూచించడంతో రైతులు రోహిణి, మృగశిర కార్తెలలో పెద్ద ఎత్తున పత్తి విత్తనాలను విత్తుకున్నారని, కానీ వర్షాలు లేకపోవడంతో ఆ విత్తనాలు పుచ్చిపోయాయని తెలిపారు. ఒక్కొక్క రైతు రూ. 5,000 నుంచి రూ. 50,000 వరకు నష్టపోయినందున ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడం వలన బోరు బావులు ఎండిపోయాయని, దీనివలన నారు పోసుకున్న రైతులు ఒక్కొక్కరు సుమారు రూ. 10,000 వరకు నష్టపోయారని, కాబట్టి ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. జనగామ జిల్లా వ్యాప్తంగా 9 రిజర్వాయర్లు, 723 చెరువులు, కుంటలు ఉన్నాయని, వీటిని, రిజర్వాయర్లన్నింటినీ పూర్తిస్థాయిలో నింపితే భూగర్భ జలాలు పెరిగి బోరు బావులు అడుగంటిపోకుండా వ్యవసాయం ముందుకు సాగే పరిస్థితి ఉన్నదన్నారు. రాష్ట్రంలో జిల్లా, మండల వ్యవసాయ శాఖ వేసిన సాగు అంచనాలో సగం కూడా సాగులోకి రాకపోవడం వలన భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆహార ధాన్యాల లోటు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని లిఫ్టింగ్ చేసి జిల్లాలోని చెరువులు, కుంటలు నింపడానికి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతల వారీగా పూర్తి చేయాలని, కాలువల నిర్మాణం కోసం గత ప్రభుత్వం రైతుల వద్ద సేకరించిన భూముల్లో త్వరగా కాలువల పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. సమస్యను పరిష్కరించే దిశగా చూస్తానని తహసీల్దార్ సానుకూలంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పోత్కానూరి ఉపేందర్, నాయకులు బండిరాజుల శ్రీరాములు, మద్దోజు రామచొక్కమ్, సాంబరాజు దుర్గాప్రసాద్, కూరాకుల శ్రీను, బాల్నే కిష్టయ్య, తాండ్ర ఆనందం, ఊరుసుల కుమార్, కాస జగన్, ఏదు రాములు, ఐలమల్లు, పెరమైన కొమురయ్య, సాంబరాజు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మోనికా పాట కోసం బాగా కష్టపడ్డా





రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కూలీ' సినిమాలో స్పెషల్ సాంగ్ కోసం వర్క్ చేశారు నటి పూజా హెగ్డే. మోనికా బెల్లూచి అంటూ సాగే ఈ పాట ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. పూజాహెగ్డే, సౌబిన్ షాహిర్ డ్యాన్స్‌కు సినీప్రియులు ఫిదా అయ్యారు. ఈ పాటకు వస్తోన్న ఆదరణను ఉద్దేశించి తాజాగా పూజాహెగ్డే ఆసక్తికర పోస్ట్ పెట్టారు. దీనిని ఆదరించిన వారందరికీ ధన్యవాదాలు చెప్పారు. కాలు బెణికినప్పటికీ పాట కోసం వర్క్ చేసినట్లు– ఆమె చెప్పారు. మోనికాపై మీరు చూపిస్తోన్న ప్రేమాభిమానానికి ధన్యవాదాలు. నా కెరీర్‌లో ఎంతగానో శ్రమించిన పాట ఇది. విపరీతమైన వేడి, ఎండ, దుమ్ము. కాలు బెణికిన తర్వాత నేను చేసిన తొలి సాంగ్ అయినప్పటికీ ఇవేమీ స్క్రీన్‌పై కనిపించకుండా కేవలం గ్లామరస్‌గా ప్రేక్షకులను అలరించేందుకు శ్రమించా. మోనికా కోసం నా బెస్ట్ ఇచ్చా. థియేటర్లలో చూసినప్పుడు ఇది తప్పకుండా అద్భుతంగా ఉంటుంది. నేను మీకు మాటిస్తున్నా. మీరంతా డ్యాన్స్ చేస్తారు. ఈ టాస్క్‌లో నాకు సపోర్ట్‌గా నిలిచిన డ్యాన్సర్లకు థాంక్యూ అని ఆమె చెప్పుకొచ్చారు. అంతేకాకుండా మహాశివరాత్రి నాడు ఈ పాట షూట్ చేసినట్లు– ఆమె చెప్పారు. ఆరోజు తాను ఉపవాసం ఉన్నట్లు– తెలిపారు. యాక్షన్ థ్రిల్లర్ మూవీగా 'కూలీ' సిద్ధమవుతోంది. హార్బర్ ఇతివృత్తంగా సాగే కథ ఇది. నాగార్జున, ఆమిర్‌ఖాన్, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, శ్రుతిహాసన్ కీలక పాత్రలు పోషించారు. ఆగస్టు 14న విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల 'మోనికా' పాటను టీమ్ విడుదల చేసింది. ఇప్పటివరకూ ఈ పాట తెలుగు, తమిళం, హిందీలో 21 మిలియన్లకు పైగా వ్యూస్ సొంతం చేసుకుంది. సౌబిన్ షాహిర్ డ్యాన్స్‌ను అందరూ మెచ్చుకుంటున్నారు.

## సోషియో డ్రామాగా వస్తున్న పరదా

అనుపమ పరమేశ్వరన్ కీలక పాత్రలో ప్రవీణ్ కంద్రేగుల తెరకెక్కించిన చిత్రం 'పరదా'. భిన్నమైన సోషియో డ్రామా కథాంశంతో రూపొందింది. ఆగస్టు 22న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్నట్లు టీమ్ అధికారికంగా ప్రకటించింది. తాజాగా ఈ సినిమా నుంచి థీమ్ ఆఫ్ పరదా 'యత్ర నార్యస్తు పూజ్యంతే..' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు– చేసిన ఈవెంట్‌కు నిర్మాత సురేశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒక మంచి విడుదల తేదీ దొరకడానికి ఆరు నెలలు పట్టింది. అన్ని ఏర్పాట్లు– చేసుకున్న తర్వాత అదేరోజు పెద్ద సినిమా రిలీజ్ అయ్యేది. థియేటర్లు దొరకలేదు. అందుకే ఇంత సమయం పట్టింది. నిజం చెప్పాలంటే.. ఒక అమ్మాయి ప్రధాన పాత్రలో నటించిన సినిమా వస్తుందంటే.. ఎవరూ ముందుకురారు. మా సినిమా సంవత్సరం క్రితమే రెడీ అయింది. ఏడాదిగా మా టీమ్ పడిన కష్టం దగ్గర నుంచి చూశాను. ఇది చిన్న సినిమా అని అందరూ చెబుతున్నారు.. కానీ ఇది చాలా మంచి సినిమా. ఎన్నో కమర్షియల్ మూమెంట్స్ ఉంటాయి. 'పరదా'ను థియేటర్‌లలో చూడాలని కోరుకుంటు–న్నాను. ఇప్పటివరకూ మీ సపోర్ట్‌కు ధన్యవాదాలు. ఇకపై కూడా ఇలానే ఆదరిస్తారని ఆశిస్తున్నాను అని అనుపమ అన్నారు.

## జక్కన్న పెద్ద స్కెచ్చే ..

### ఆస్కార్ లెవల్లో మహేశ్ మూవీకి ప్లాన్

దర్శకధీరుడు రాజమౌళి ఏం చేసినా భారీ ప్లాన్ తోనే చేస్తాడు. ఇప్పుడు మహేశ్ బాబుతో తీస్తున్న ఎస్ ఎస్ ఎంబీ29 సినిమా కోసం భారీ ప్లాన్ చేస్తున్నాడంట. ఆస్కార్ అవార్డు కోసం రాజమౌళి బిగ్ స్కెచ్ వేస్తున్నట్టు– తెలుస్తోంది. ఆల్రెడీ త్రిబుల్ ఆర్ మూవీతో ఒకటి తీసుకొచ్చాడు. ఇప్పుడు ఇంకోదానిపై కన్నేసినట్టు తెలుస్తోంది. అయితే తెలుగు నిర్మాణ సంస్థలతో మూవీ చేస్తే ప్రతిసారి ఫారిన్ కేటగిరీలో నామినేషన్స్ వేయాల్సి వస్తోంది. అప్పుడు ఆస్కార్ అవార్డుల అవకాశాలు బాగా తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం మహేశ్ తో చేస్తున్న మూవీని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్ మీద డాక్టర్ కెఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. తెలుగు బ్యానర్ మీద కాకుండా హాలీవుడ్ బ్యానర్ ను మెయిన్ నిర్మాణ సంస్థగా చూపించేందుకు రాజమౌళి ప్రయత్నిస్తున్నారంట. అందుకోసం హాలీవుడ్ కు చెందిన నిర్మాణ సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు– తెలుస్తోంది. హాలీవుడ్ నిర్మాణ సంస్థను మొదటి ప్రొడ్యూసర్ గా చూపించి కేఎల్ నారాయణను రెండో సంస్థగా చూపించవచ్చు. అలా చేస్తే మూవీ హాలీవుడ్ కోటాలో నేరుగా ఆస్కార్ అవార్డుకు నామినేట్ చేయొచ్చు. అప్పుడు ఎక్కువ విభాగాల్లో ఆస్కార్ కు నామినేషన్స్ వేయొచ్చు. కాకపోతే మూవీ షూట్ ను డైరెక్ట్ గా ఇంగ్లిష్ లో చేయాలి. అదేమంత పెద్ద కష్టం కాకపోయినా.. కొంత బడ్జెట్ పెరుగుతుంది. ఆ లెక్కలు అన్నీ కార్తికేయ చూసుకుంటున్నట్టు– తెలుస్తోంది. అన్నీ కుదిరితే త్వరలోనే దీనిపై అనౌన్స్ మెంట్ వస్తుంది.






## బాహుబలిని కట్టప్ప చంపకపోతే..

### సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర చర్చ

బాహుబలి మూవీపై ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర చర్చ సాగుతోంది. బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు' పదేళ్ల కిందట యావత్ భారత్ దేశం ఈ ప్రశ్నకు సమాధానం కోసం ఎదురు చూసింది. ఒకవేళ 'బాహుబలిని కట్టప్ప చంపకపోతే' అంటూ 'బాహుబలి' టీ–మ్ అడిగిన ప్రశ్నకు రానా సమాధానం ఇచ్చారు. 'అదే జరిగితే, అతని బదులు నేనే చంపేసేవాడిని' అని అన్నారు. దీనిపై ప్రభాస్ స్పందించారు. 'రూ.1000 కోట్ల కలెక్షన్స్ సాధించిన పోస్టర్‌ను పంచుకుంటూ 'దీని కోసం నేను అదే చేయనిచ్చేవాడిని భళ్లా' అని రిప్లై ఇచ్చారు. ప్రస్తుతం ఇద్దరి మధ్య జరిగిన చర్చ సామాజిక మాధ్యమాల వేదికగా నవ్వులు పూయిస్తోంది. ప్రభాస్, రానా, అనుష్క, సత్యరాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రల్లో ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన ఎపిక్ యాక్షన్ మూవీ 'బాహుబలి'. రెండు భాగాలుగా వచ్చిన ఈ మూవీ తెలుగు సినీ ఖ్యాతిని ప్రపంచ యవనికపై నిలబెట్టింది. ఇప్పుడు ఈ రెండిరటినీ కలిపి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే మూవీగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అక్టోబరు 31న 'బాహుబలి: ది ఎపిక్'ను విడుదల చేయనున్నారు.



వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, జూలై 17, 2025

# మహిళా సాధికారతే లక్ష్యం

◆ పలు వ్యాపారుల్లో వారి భాగస్వామ్యం

◆ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**వరంగల్ వాయిస్, ములుగు :** మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్ లో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సెర్ప్ అదనపు సీఈఓ పి.కట్యాయని దేవి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ లతో కలిసి మంత్రి సీతక్క ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ బీమా, ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇందిరమ్మ కళలను నెరవేర్చడానికి కాంగ్రెస్ సర్కార్ పలు అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. మహిళల జీవితాల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకుంటూ సంబురాలు చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాలకు సుమారు రూ.26 వేల కోట్లు బ్యాంక్ లింకేజ్ రుణాలు పంపిణీ చేశామన్నారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలకు లక్షల కోట్లు కేటాయించడంతో పాటు వడ్డీ మాఫీ చేసిన ఘనత తమదే అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగాల కన్నా ప్రైవేట్ రంగంలో మహిళలు రాణించడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, సంబంధిత అధికారులు, మండల సమాఖ్య సభ్యులు, ఏపీఎంలు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**మృతుల కుటుంబాలకు పరామర్శ..**

వెంకటా పూర్ మండలం రామాంజాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బుర్ర సమ్మయ్య తల్లి ప్రథమ వర్ధంతితో పాటు అదే గ్రామానికి చెందిన డాక్టర్ రాజమౌళి తండ్రి రాగుల రాజయ్య దశ దినకర్మ గురువారం నిర్వహించారు. వేరు వేరుగా జరిగిన ఈ కార్యక్రమాలకు మంత్రి సీతక్క హాజరై చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీతక్క వెంట భద్రాచలం ఏమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్ రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాం రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, బ్లాక్ కాంగ్రెస్ ములుగు అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డి, వెంకటాపూర్ మండల అధ్యక్షులు చెన్నోజు సూర్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, వేముల చంద్రాకర్ రెడ్డి, దొంతరవేన కుమార్, మిల్కూరి ఐలయ్య, మామిడి శెట్టి కోటి, మారం సుమన్ రెడ్డి, కట్టేకోళ్ల వెంకటేష్, నల్ల కోటి, చెన్నోజు శ్రీను, జంగిలి రవి, మండల, గ్రామ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సైలెన్సర్లతో టవర్

**ట్రాఫిక్ పోలీసుల వినూత్న ప్రదర్శన**

**యువతకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఏర్పాటు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సైలెన్సర్లు మార్పు చేస్తే సమస్యలు తప్పవన్న సంకేతాన్ని యువతకు కల్పించాలన్న లక్ష్యంతో వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు వినూత్నంగా ఆలోచన చేశారు. కొందరు యువకులు తమ ద్విచక్ర వాహనాల సైలెన్సర్‌లను మార్చి, చెవులు చిల్లులు పడేలా శబ్దాలతో, పరిమితికి మించిన వేగంతో రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న యువతలో మార్పులు తీసుకొచ్చేందుకు చిన్ని ప్రయత్నం చేశారు. వారిలో అవగాహన కల్పించేందుకు తనిఖీల సమయంలో స్వాధీనం చేసుకున్న సైలెన్సర్‌లతో హనుమకొండలోని అశోక కూడలిలో ఓ భారీ టవర్‌ను ఏర్పాటు చేశారు. ఎక్కుపెట్టిన తుపాకీని పోలి ఉండేలా దీన్ని తీర్చిదిద్దడంతో అందరినీ ఆకట్టుకుంటోంది. సైలెన్సర్లు మార్చి సమస్యలు సృష్టిస్తే మీమీద తుపాకి ఎక్కిపెట్టి ఉంటుందన్న సంకేతాన్ని దీనిద్వారా యువతకు అందిస్తున్నారు. శబ్ద కాలుష్యానికి పాల్పడితే సైలెన్సర్‌లను స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని, అందరికీ అవగాహన కల్పించేందుకే ఈ టవర్‌ను ఏర్పాటు చేశామని ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు.

# క్యూలైన్ లో చెప్పులు, బుక్కులు

◆ యూరియా కోసం రైతుల పడిగాపులు

◆ మంత్రి ఇలాఖాలోనూ తప్పని తిప్పలు



**వరంగల్ వాయిస్, పరకాల :** హనుమకొండ జిల్లా పరకాల వ్యవసాయ మార్కెట్‌లో యూరియా కొరతతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గంటల కొద్ది క్యూ లైన్ లో నిలుచోలేక చెప్పులను పెట్టి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. పొలం పనులు వదులుకొని రోజంతా కష్టపడితే కేవలం రెండు యూరియా బస్తాలు మాత్రమే ఇస్తున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ ప్రారంభం కాకముందే యూరియా కొరత ఏర్పడటంతో రైతులు మండిపడుతున్నారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటలు ఏపుగా పెరగాలంటే యూరియా ఎంతో అవసరమంటున్నారు. వర్షాలు సమృద్ధిగా లేక ఒకవైపు, పండిన పంటకు గిట్టుబాటు ధర లభించక మరోవైపు కష్టాలు పడుతున్న రైతులకు, యూరియా కొరత మరింత ఆవేదన కలిగిస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం యూరియా సమస్యను గుర్తించి, కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

**మంత్రి ఇలాఖాలో..**

నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో యూరియా కోసం రైతులు క్యూ లైన్ లో పాసుపుస్తకాలు, రాళ్లు పెట్టి తెల్లవారుజాము నుంచి పడిగాపులు కాస్తున్నారు. సాక్షాత్తు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీహరి ఇలాఖాలోనే ఈ పరిస్థితి నెలకొంది. పెద్ద ఎత్తున రైతులు క్యూ లైన్ లో వేచి ఉంటున్నారు. నిలబడే ఓపిక లేని కొంతమంది రైతులు నేలపైనే కూర్చుంటున్నారు. ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రైవేటు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అయితే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఎరువుల సరఫరా చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## మత్తెక్కిస్తున్న గంజాయి




**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** గంజాయి మత్తుకు యువత చిత్తవుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసి రాందేవ్ ఆవేదన వ్యక్తం చేశారు. యువకులు, విద్యార్థులు జంగాయికి బానిసలుగా మారి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మధ్య వయసులోనే గంజాయి మత్తులో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఉర్సు, కరీమాబాద్, శంబునిపేట ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్ ఆగడాలు మితిమీరుతున్నాయన్నారు. పలు ఖాళీ ప్రదేశాల్లో, పార్కుల్లో గంజాయి సేవించి అటుగా వచ్చే మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్నారు. మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడుపుతూ ఆ దారిలో ప్రయాణించే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కరీమాబాద్ చెట్లవారిగడ్డ మీద ప్రధాన రహదారిపైనే ఉన్న వైన్ షాపుతో బాటసారులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. సాయంత్రం అయిందంటే చాలు రహదారిపై విచ్చల విడిగా వాహనాలను నిలుపడంతో రాకపోకలకు కూడా తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదన్నారు.



## దశదినకర్మకు హాజరైన జర్నలిస్టులు

**వరంగల్ వాయిస్, నర్సంపేట :** ఉదయం మిత్ర మండలి సంక్షేమ సంఘం వరంగల్ అధ్యక్షుడు దాసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులు ఖానాపూర్ మండల పరిషత్ మాజీ అధ్యకుడు తక్కళ్ళ పల్లి రవీందర్ రావు తండ్రి తక్కళ్ళపల్లి ఆగారావు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. ఖానాపూర్ మండలం అశోక్ నగర్ లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం మిత్ర మండలి సంక్షేమ సంఘం బాధ్యులు సర్దార్ ఓంకార్ సింగ్, పి.వెంకటేశ్వర్ రావు, బి.రాజమౌళి, అచ్యుత రఘునాథ్, నీల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలను కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నూతన కమిటీ

**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వరంగల్ జిల్లా నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు గురువారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయ్ కుమార్, కార్యదర్శి బొట్ల స్వామిదాసు, ఉపాధ్యక్షులు వెల్ది రాజేందర్, కరిమిల్ల దుర్గారావు, సహాయ కార్యదర్శులు బావండ్లపల్లి కిరణ్ కుమార్, రాంపెల్లి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ పాలడుగుల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



# సబ్ స్టేషన్ ను సందర్శించిన సీఎండీ



**వరంగల్ వాయిస్, దేవన్నపేట :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ పనుల పురోగతిలో భాగంగా గురువారం దేవన్నపేటలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భాంగా రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టం దోహద పడుతుందన్నారు. రియల్ టైంలో కచ్చితమైన సమాచారం పొందగలుగుతామని తద్వారా వేగవంతంగా చర్యలు చేపట్టవచ్చున్నారు. ఫీడర్ ల పర్యవేక్షణ, త్వరితగతిన ప్రతి స్పందించడం ద్వారా అంతరాయాలు గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈ ప్రాజెక్ట్స్ తిరుమల్ రావు, ఎస్ఈ (ఓపీ) హనుమకొండ పి.మధుసూదన్ రావు, జీఎం ఐటీ శ్రీనివాస్, డీఈ ఎమ్మార్టీ, విజిలెన్స్ కె.అనిల్ కుమార్, డీఈ ఎమ్మార్టీ దర్శన్, ఏడీఈ (ఓపీ) హసన్‌పర్తి పి.అశోక్, ఎమ్మార్టీ ఏడీఈ, ఏఈ చింతగట్టు టౌన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com